## రామప్ప వారసత్వానికి ఓపెన్‌కాస్ట్ ముప్పు!




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## శ్రీనగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 287 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 11 అక్టోబర్ 2026




# ఢిల్లీలో నిరసనలపై పోలీసుల ఉక్కుపాదం!

**- కేజ్రీవాల్, మమతా బెనర్జీ సహా నలుగురు మాజీ సీఎంల అదుపులోకి.. 1,500 మందికి పైగా నిర్బంధం**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసనలపై పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం రాజధానిలో మిగతా2లో...

# ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం!

**● కొవిడ్ తరహాలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి ● నీరు, విద్యుత్ పొదుపునకు ప్రత్యేక చర్యలు.. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**హైదరాబాద్,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొవిడ్ సమయంలో అనుసరించిన విధానంలోనే ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతపై ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో



అప్రమత్తంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, సాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన పెంచాలని సూచించారు.విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి, సరఫరాలో అంతరాయాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే విద్యుత్ కొనుగోలుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో మిగతా2లో...

## రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలు వద్దు!

**- ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల విమర్శలు సరికాదు.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**



**హైదరాబాద్,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఓట్ల తొలగింపు మిగతా2లో...

# నవంబర్ 19నుంచి ఇందిరమ్మ బీమా!

**- కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా.. పథకం ప్రారంభానికి ప్రభుత్వం సన్నాహాలు**



**ఖమ్మం,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.శనివారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ బీమా మిగతా2లో...



## 'సర్'పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టండి!

**బీజేపీ శ్రేణులకు రాంచందర్‌రావు పిలుపు**

**హైదరాబాద్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, అధికార ప్రతినిధులు, వివిధ విభాగాల కన్వీనర్లు, మీడియా మిగతా2లో...

# జగన్‌కు ఈడీ షాక్..

- ● అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ
- ● జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- ● రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన




**హైదరాబాద్ అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు మిగతా2లో...

## ఏపీలో బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం!

**స్థానిక సంస్థల్లో పదవుల వారీగా రిజర్వేషన్లు ఖరారు**

**మేయర్ పదవులకు 35.29 శాతం.. సర్పంచులకు 27.95 శాతం**



**అమరావతి,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆమోదం తెలిపింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను ఆమోదిస్తూ పదవుల వారీగా రిజర్వేషన్ల శాతాలను ఖరారు మిగతా2లో...

## దేశాన్ని అస్థిరపరిచే కుట్రలు సాగవు!

**● ఇండియా కూటమి, సీజేపీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపణలు ● విదేశీ శక్తుల ఆదేశాలతో ఆందోళనలు చేస్తున్నారంటూ విమర్శలు**




## రాహుల్‌గాంధీతో విజయ్ భేటీ..

- ● కాఫీతో రాజకీయ ముచ్చట్లు!
- ● గంటపాటు కీలక చర్చలు.. కేఫ్‌లో అభిమానులతో సెల్ఫీలు



**చెన్నై, అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత సి. జోసెఫ్ విజయ్ చెన్నైలో సమావేశమయ్యారు. నీలాంకరైలోని విజయ్ నివాసంలో సుమారు గంటపాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు ఆస్వాదించారు. ఈ సందర్భ ంగా కేఫ్‌లో ఉన్న అభిమానులు ఇద్దరు నేతలను చూసేందుకు ఆసక్తి చూపించారు. పలువురు వారితో సెల్ఫీలు దిగారు. రాజకీయ చర్చల మిగతా2లో...

# దేశాన్ని అస్థిరపరిచే కుట్రలు సాగవు!

**న్యూఢిల్లీ,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి, సీజేపీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనుచరులు ఈ ప్రయత్నాల్లో భాగస్వాములుగా ఉన్నారని విమర్శించారు. శాంతి సామరస్యాలతో జీవిస్తున్న దేశ ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శనివారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోవడం లేదని విమర్శించారు. ప్రజల తీర్పు నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన నాయకులు దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం, విదేశీ శక్తుల ఆదేశాల మేరకు ఆందోళనలు నిర్వహిస్తున్నారని వ్యాఖ్యానిం చారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని నితిన్ నబీన్ పేర్కొన్నారు. దేశ పురోగతిని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాజ్యాంగం పేరుతో ప్రజాస్వామ్య వ్యవస్థను సవాలు చేయడాన్ని ప్రజలు అంగీకరించరని అన్నారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రభుత్వం కఠినంగా ఎదుర్కొంటుందని హెచ్చరించా రు. దేశభక్తులంతా ఐక్యంగా నిలిచి ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకుంటారని నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు.

# నవంబర్ 19నుంచి ఇందిరమ్మ బీమా!

**(మొదటి పేజీ తరువాయి)**

పథకాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో సుమారు 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా, దాదాపు 1.06 కోట్ల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతినెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు భట్టి తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించామని చెప్పారు.

గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ బీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, అర్హతలు, పరిహారం చెల్లింపు విధివిధానాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి!

### సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.. పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపు



**ఖమ్మం,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మంవరంగల్‌నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టభద్రులను నేరుగా కలవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించాలని సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఖమ్మంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ చర్యలను పట్టభద్రులకు వివరించి, వారి విశ్వాసాన్ని పొందాలని పార్టీ శ్రేణులకు సూచించారు. **యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు కూడగట్టాలని సూచించారు. **ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు** ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన బకాయిల చెల్లింపులపై దృష్టి సారించామని తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో సుమారు రూ.9 వేల కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, విద్యావంతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి ప్రభుత్వ విధానాలను వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఓటరును కలవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. **సమన్వయంతో పనిచేయాలి** ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకుని ప్రచారాన్ని విస్తృతం చేయాలని సూచించారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరును సంప్రదించాలని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ, భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలు, పట్టభద్రులను సంప్రదించే విధానాలపై చర్చించినట్లు తెలిసింది.

# రేడియల్ రోడ్-2 టెండర్లలో భారీ కుంభకోణం!

### తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలకు అన్యాయం జరిగిందని కేటీఆర్ ఆరోపణలు

### రూ.3,296 కోట్ల ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరపాలి.. టెండర్లు రద్దు చేయాలి



**హైదరాబాద్,అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో రూ.3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్లలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. నచ్చిన సంస్థలకే పనులు కట్టబెట్టేందుకు టెండర్ల ప్రక్రియను నిర్వహించారనే అనుమానాలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. టెండర్లను రద్దు చేసి, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొడంగల్ సమీపంలోని జాతీయ రహదారి 167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ప్రభుత్వం మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచింది. గత నెల 30వ తేదీతో బిడ్ల దాఖలు గడువు ముగియగా, ఈ నెల 8వ తేదీ నాటికే సాంకేతిక మూల్యాంకనం, బిడ్డర్ల అర్హతల పరిశీలన, ఆర్థిక బిడ్ల పరిశీలన, కేటాయింపుల ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు.రూ.3,296 కోట్ల భారీ ప్రాజెక్టుకు సంబంధించి 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, పనుల కేటాయింపుల ప్రక్రియను సెలవులు మినహాయిస్తే కేవలం ఐదు పని దినాల్లోనే ఎలా పూర్తి చేశారని ఆయన ప్రశ్నించారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు.ప్రతి ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి? ఎన్ని సంస్థలు అర్హత సాధించాయి? ఏ సంస్థ ఎంత ధరను కోట్ చేసింది? అంచనా వ్యయంతో పోలిస్తే తుది కేటాయింపు ఎంత ఎక్కువగా ఉంది? వంటి వివరాలను వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకే సంస్థను ఒక ప్యాకేజీలో అర్హంగా, మరో ప్యాకేజీలో అనర్హంగా ఎలా ప్రకటించారని ప్రశ్నించారు.అతి తక్కువ ధరకు బిడ్లు వేసినట్లు చెబుతున్న సుషీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్‌ను మూడు ప్యాకేజీల్లోనూ అనర్హంగా ప్రకటించడంపై కూడా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల మూడు ప్యాకేజీల్లో కలిపి రాష్ట్రానికి సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లుతుందని సదరు సంస్థ తరఫున కోర్టులో సమర్పించిన వాదనల్లో పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. టెండర్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ కోరారు. టెండర్ల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేసి, నిష్పక్షపాతంగా విచారణ జరిపిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ అంశంపై కేటీఆర్ చేసినవి ఆరోపణలు కాగా, వాటిపై ప్రభుత్వ వివరణ లేదా విచారణ ఫలితాలు వెలువడాల్సి ఉంది.

# ఢిల్లీలో నిరసనలపై పోలీసుల ఉక్కుపాదం!

**(మొదటి పేజీ తరువాయి)**

జరిగిన ఆందోళనల సందర్భంగా 1,500 మందికి పైగా నిరసనకారులను నిర్బంధించారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్ ఉన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు భారీగా మోహరించి, పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు.నిరసనలో పాల్గొనేందుకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు కేరళ మాజీ సీఎం పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కూడా నిర్బంధానికి గురయ్యారు.ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన ఎన్నికల సంఘం, నిరసనలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టిందని ఆరోపించారు. మరోవైపు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం మరింత ముదిరింది.

## రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలు వద్దు!

**(మొదటి పేజీ తరువాయి)**

ఆరోపణలపై ఆయన స్పందించారు. ఓట్లను భారీ సంఖ్యలో తొలగించారన్నది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు.ప్రతిపక్షాలు అతిగా వ్యవహరిస్తున్నాయని వెంకయ్య నాయుడు విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలంటూ వస్తున్న డిమాండ్లు సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరును రాజకీయాలతో ముడిపెట్టడం తగదని సూచించారు.ఎన్నికల్లో విజయం సాధించినప్పుడు గొప్పలు చెప్పుకోవడం, ఓటమి ఎదురైనప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) నిందించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.రాజ్యాంగ సంస్థలను వీధుల్లోకి లాగడం వల్ల దేశ ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ఎందుకు వివాదం చేస్తున్నాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. రాజకీయ విభేదాల కంటే దేశ ప్రతిష్ఠకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

## జగన్‌కు ఈడీ షాక్..

**(మొదటి పేజీ తరువాయి)**

ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## ఏపీలో బీసీ రిజర్వేషన్లకు కేబినెట్ ఆమోదం!

**(మొదటి పేజీ తరువాయి)**

చేసింది. సుప్రీంకోర్టు తీర్పు, నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు వెల్లడించారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు 26.73 శాతం, సర్పంచులకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం, జెడ్పీ చైర్‌పర్సన్లకు 23.08 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు సభ్యులకు 32.7 8 శాతం, మున్సిపల్ చైర్‌పర్సన్లకు 33.02 శాతం, మేయర్ పదవులకు 35.29 శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారు.స్థానిక సంస్థల్లో బీసీలకు చట్టపరంగా రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు తెలిపారు. ఈ సిఫార్సుల ఆధారంగా తదుపరి ప్రక్రియ కొనసాగనుంది.

## రాహుల్‌గాంధీతో విజయ్ భేటీ..

**(మొదటి పేజీ తరువాయి)**

అనంతరం సాధారణంగా అభిమానులతో ముచ్చటిస్తూ కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యార్థులతో సమావేశంలో పాల్గొనేందుకు చెన్నై వచ్చిన రాహుల్‌గాంధీ.. విజయ్‌తో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్, టీవీకే మధ్య సమన్వయం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. అయితే సమావేశంలో చర్చించిన అంశాలపై ఇరు పార్టీల నుంచి అధికారిక వివరాలు వెల్లడికాలేదు.

## ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభావాన్ని పరిశీలించి, రైతులకు అవసరమైన సహాయం అందించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

## ‘సర్’పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టండి!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను రూపొందిస్తోందని పేర్కొన్నారు. బోగస్ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల ఓటములతోనే కాంగ్రెస్ రాజ్యాంగ సంస్థలపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. ‘ఓట్ చోరీ’ ప్రచారాన్ని ప్రజల్లో వాస్తవాలతో తిప్పికొట్టాలని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి కలిగించే ప్రయోజనాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# రామప్ప వారసత్వానికి ఓపెన్‌కాస్ట్ ముప్పు!

### 25 గ్రామాల భవిష్యత్తును దెబ్బతీసే బొగ్గు తవ్వకాలను నిలిపివేయాలి

### మానవ హక్కుల వేదిక డిమాండ్.. జంగాలపల్లి క్రాస్ నుంచి రామప్ప వరకు చైతన్య ర్యాలీ




**ములుగు అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, రామప్ప చెరువు పరిరక్షణకు ముప్పుగా మారే అవకాశం ఉన్న సింగరేణి ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్టుతో పర్యావరణానికి, ప్రజల జీవనోపాధికి కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం జంగాలపల్లి క్రాస్ నుంచి రామప్ప దేవాలయం వరకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రామప్ప చెరువు భద్రతపై బొగ్గు తవ్వకాల ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని వేదిక ప్రతినిధులు కోరారు. తవ్వకాల కోసం జరిపే పేలుళ్లు, భూకంపనాలు, భూగర్భ మార్పులతో చెరువు, పరిసర ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశాలను విస్మరించరాదని పేర్కొన్నారు. సుమారు 25 గ్రామాల ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ ప్రాజెక్టుపై ప్రజలకు పూర్తి సమాచారం అందించి, పర్యావరణ ప్రభావాలపై సమగ్ర పరిశీలన చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్ట్ తవ్వకాలతో దుమ్ము, ధూళి పెరిగి వాయు కాలుష్యం తీవ్రతరం కావడంతోపాటు వ్యవసాయ పంటల దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయే కుటుంబాలతో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, ప్రకృతి వనరులు, జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. తాడిచెర్ల తదితర ప్రాంతాల్లో ఓపెన్‌కాస్ట్ తవ్వకాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి పేరుతో ప్రజల జీవనాధారాలను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన మానవ హక్కుల వేదిక ప్రతినిధులు.. రామప్ప వారసత్వ సంపదను, చెరువును, ప్రకృతి వనరులను, 25 గ్రామాల ప్రజల భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపాదిత ప్రాజెక్టును వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాధావత్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దునూరి యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి. దిలీప్, సభ్యులు ఏ. శ్రీనివాస్, గణేష్, ఉయ్యాల సురేందర్, అచ్యుత్ కుమార్, పొన్నాల రమేష్, జి. పద్మజ, పి. శ్రీనివాస్, మండల యుగంధర్, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలి

### మైనారిటీ బడ్జెట్‌ను సక్రమంగా అమలు చేయాలి

### మంత్రి అజారుద్దీన్‌కు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ వినతి



**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కబ్జాకు గురైన వక్ఫ్ భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, మైనారిటీ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో శనివారం ఆయనను కలిసి జిల్లాలోని మైనారిటీల సమస్యలను వివరించారు. వక్ఫ్ బోర్డు చైర్మన్‌తో కలిసి కరీంనగర్ జిల్లాకు వచ్చి కబ్జాకు గురైన భూములను పరిశీలించాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో మసీదుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించేందుకు జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ సంక్షేమ పథకాల అమలుపై ప్రతి ఆరు నెలలకోసారి కలెక్టర్ల అధ్యక్షతన సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కోరారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న పట్టణాలు, మండలాలు, డివిజన్ కేంద్రాల్లో ఖబరస్తాన్లు, ఈద్గాల కోసం స్థలాలు కేటాయించాలని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, వాటి అమలు ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, విదేశీ విద్య పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. అలాగే సబ్సిడీ రుణాలు, కుట్టు మిషన్లు, డ్రైవర్ కమ్ ఓనర్ పథకాల కింద యూనిట్ల సంఖ్య పెంచాలని, సంచార ముస్లిం వర్గాలు, చేతివృత్తుల వారికి పనిముట్లు, ద్విచక్ర వాహనాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా ఈ సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు గులాం అహ్మద్ మంత్రికి వివరించారు.

# కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌ది మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం!

### ఇరవై ఏళ్లుగా ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ డ్రామాలు: సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న రాజకీయాలు మ్యాచ్ ఫిక్సింగ్‌ను తలపిస్తున్నాయని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. గత ఇరవై ఏళ్లుగా ప్రజలను మభ్యపెడుతూ రెండు పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. గత పాలకవర్గం అవినీతిపై నేడు బీఆర్ఎస్ నాయకులే మాట్లాడుతుండటం గమనార్హమని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో జరిగిన అవినీతి గురించి ఇప్పుడు ప్రశ్నిస్తున్న నేతలు, అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రాజకీయాలు నాటకాలు, బూటకపు విమర్శలతో సాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలు పరస్పరం సహకరించుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం రెండు పార్టీలు రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్నాయని, మునిగిపోతున్న రెండు నావల్లోకి ఎక్కేందుకు ఎవరు ముందుకొస్తారని వ్యాఖ్యానించారు. పార్టీల్లోకి చేరికల పేరుతో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని విమర్శించారు. ఇటీవల బీజేపీ నీటి విడుదల అంశంపై చేసిన ఆందోళనను ఆయన డ్రామాగా అభివర్ణించారు. తాజాగా బీఆర్ఎస్ చేపట్టిన మున్సిపల్ ముట్టడిని కూడా రాజకీయ నాటకంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని, కేవలం రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. బీజేపీ పాలకవర్గం ప్రజా సమస్యలను పట్టించుకోకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటుందని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ సంబంధాలపై ప్రజలకు స్పష్టత వచ్చిందని, ఇకపై ఇలాంటి రాజకీయాలు సాగవని ఆయన అన్నారు.

# శ్రీనగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

### - సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు



**మల్లంపల్లి మండల ప్రతినిధి, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ములుగు జిల్లా శ్రీనగర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ సంబరాలు జరుపుకున్నారు. మహిళల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు.



# జంతర్ మంతర్ వద్ద లాఠీచార్జి, అరెస్టులు అప్రజాస్వామికం

### ● సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: షేక్ షావలి



**హైదరాబాద్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓటు హక్కు పరిరక్షణ కోసం నిరసన తెలిపిన విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం, అరెస్టులకు పాల్పడటాన్ని సీపీఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, ప్రజల గొంతుకను అణచివేసే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అనేక ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని షేక్ షావలి కోరారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించే ముందు సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి, అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# హనుమకొండ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ న్యాయవాది అనిల్ రెడ్డి

### ● గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ తరఫున న్యాయస్థానాల్లో వాదనలు వినిపించనున్న అనిల్ రెడ్డి.. మూడేళ్ల పాటు పదవీకాలం



**హనుమకొండ, అక్టోబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాల్లో సమర్థవంతమైన ప్రాతినిధ్యం కల్పించే దిశగా సీనియర్ న్యాయవాది పోలుసాని అనిల్ రెడ్డిని హనుమకొండ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ ఎన్. వెంకన్న అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హనుమకొండ జిల్లాకు సంబంధించి న్యాయస్థానాల్లో విచారణకు వచ్చే కేసుల్లో కార్పొరేషన్ తరఫున వాదనలు వినిపించడం, సంబంధిత న్యాయపరమైన అంశాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం స్టాండింగ్ కౌన్సిల్ బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఈ నియామకం ద్వారా కార్పొరేషన్‌కు సంబంధించిన కేసుల నిర్వహణలో న్యాయపరమైన ప్రాతినిధ్యం కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. కార్పొరేషన్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, పోలుసాని అనిల్ రెడ్డి నియామకం ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి మూడేళ్లపాటు అమల్లో ఉండనుంది. ఈ కాలంలో ఆయన కార్పొరేషన్‌కు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాల్లో నిర్దేశిత బాధ్యతలను నిర్వర్తించనున్నారు. తనను హనుమకొండ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పోలుసాని అనిల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తాననే ఆశాభావం వ్యక్తం చేశారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు!

### - లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్.. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు



**ములుగు, అక్టోబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్‌ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ములుగు జిల్లా పోలీసులు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా పస్రా ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్లతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పోలీసులు వివరించారు. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం, అజాగ్రత్త అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపుతాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే లారీ డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసుల తనిఖీలు కొనసాగుతాయని, వాహనదారులు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పస్రా పోలీసులు అవగాహన కల్పించారు.

# సెయింట్ మైఖేల్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కల్లూరు, అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరులోని సెయింట్ మైఖేల్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ హసన్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బండారుపల్లిలో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

**• పూల పండుగతో పల్లెల్లో సందడి..**

**బతుకమ్మలతో అలరిస్తున్న చిన్నారులు, మహిళలు**




**ములుగు, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లిలో ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు, చిన్నారులు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి సంబరాల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను చేతబట్టి సందడి చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ పూల పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పెద్దలను చూసి చిన్నారులు సైతం బతుకమ్మలను పేర్చుతూ పండుగలో భాగస్వాములు కావడం విశేషం. మహిళలు, చిన్నారుల సందడితో బండారుపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.

# వార్డు మెంబర్లుకు గౌరవ వేతనం చెల్లించాలి: వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్



**రామడుగు, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్ ):** తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ వార్డు సభ్యుల కు నెలకు 3000 రూపాయల గౌరవ వేతనం అందించాలని కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రము కు చెందిన 10వ వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్ .వార్డు సభ్యులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రతి వార్డు సభ్యులు కు హెల్త్ కార్డులు మంజూరుచేయాలని,శిలాపలకాలలో ప్రోటోకాల్ పరంగా స్థానిక వార్డు సభ్యులు పేర్లను ముద్రించాలని, అలాగే ఎవరైనా వార్డు సభ్యులు మరణిస్తే అతని ఫ్యామిలీనీ ఆదుకునే విధంగా 5 లక్షల భీమా సౌకర్యం కలిపించెలా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. నిరంతరం వార్డు సమస్యలు పై అవగాహన ఉంచుకొని స్థానిక సర్పంచ్,ఉపసర్పంచ్,అధికారులతో సంప్రదింపులు జరిపి వార్డు ప్రజల సమస్యలు తీరుస్తూ వార్డు అభివృద్ధి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్న వార్డు సభ్యులు కు తగిన గౌరవం కల్పిస్తూ వారి డిమాండ్లను నెరవేర్చాలని వార్డు సభ్యులు మామిడి దిలీప్ ప్రభుత్వంనుకోరారు. అలాగే గ్రామప్రజలుసమస్యలు,అభివృద్ధిపై మన వార్డు సభ్యులు హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని ఆయన అన్నారు.

# గుల్షన్ ఎక్స్‌పోను సందర్శించిన ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అథీఫ్ (అతినా)



**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న గుల్షన్ ఎక్స్‌పోను ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ అథీఫ్ (అతినా) సాహెబ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు, అక్కడి ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి మొహ్సిన్ మొహియుద్దీన్ సాహెబ్‌తో పాటు ఆయన బృందం, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్శన ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడం, స్థానిక కార్యక్రమాలకు మద్దతు అందించడం, సమాజంలోని వివిధ వర్గాలతో సత్సంబంధాలను పెంపొందించుకోవడంలో భాగంగా నిలిచింది. ఐక్యత, నాయకత్వం, ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సామాజిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.




# మల్లంపల్లిలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**• ఆడపడుచుల ఆనందానికి పెద్దపీట.. పండుగకు అన్ని ఏర్పాట్లు చేసిన సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు**



**మల్లంపల్లి అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఆడపడుచుల కోలాహలం, బతుకమ్మ పాటలతో మల్లంపల్లిలో పండుగ సందడి నెలకొంది. **ఆడపడుచుల సంతోషమే లక్ష్యంగా ఏర్పాట్లు** బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆనందంగా వేడుకలు జరుపుకునేందుకు సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. బతుకమ్మ ఆడుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, వేడుకలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. మహిళల సంతోషానికి ప్రాధాన్యతనిస్తూ పండుగ నిర్వహణపై దృష్టి సారించడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది. **సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ బాట**బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. మల్లంపల్లిలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు మహిళల్లో నూతనోత్సాహాన్ని నింపుతూ గ్రామంలో పండుగ శోభను తీసుకొచ్చాయి.

# ఆకులవారి ఘనపూర్‌లో ఘనంగా చిన్న బతుకమ్మ వేడుకలు

**- రంగురంగుల పూలతో బతుకమ్మలు.. సంప్రదాయ పాటలు, ఆటపాటలతో సందడి**




**ఏటూరునాగారం, ములుగు జిల్లా (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపూర్‌లో ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 13వ వార్డు సభ్యురాలు ఆవుల అక్షయ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి లక్ష్మీదేవి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో బతుకమ్మలను ఉంచి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలంతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.బతుకమ్మలను పూజిస్తూ కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలకు మంచి జరగాలని మహిళలు ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలకమని ఈ వేడుకలు చాటిచెప్పాయి. మహిళలంతా ఐక్యంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# ఏటూరునాగారంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**• సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఆడపడుచులు**



**ఏటూరునాగారం, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఘనంగా కొనసాగుతున్నాయి. సేవా యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది.మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు సైతం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ సందడిని మరింత పెంచారు.సేవా యువజన సంఘం అధ్యక్షుడు లింగాచారి, ఉపాధ్యక్షుడు బండారు లక్కీ, సలహాదారులు కందుకూరి సుధాకర్, పిల్ల సత్యనారాయణ, గుర్రపు నరేష్‌తో పాటు సంఘం సభ్యులు వేడుకల నిర్వహణలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సామూహికంగా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు సంఘం కృషి చేస్తోంది.ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తోంది. సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఏటూరునాగారంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు స్థానికుల్లో ఆనందోత్సాహాలను నింపుతున్నాయి.

# కరీంనగర్‌లో రేపు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**• సాయి కృష్ణా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు**

**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 11 కేవీ సాయి కృష్ణా ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడనుంది.ముకరంపురా, బస్టాండ్ ప్రాంతం, బాగత్‌నగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, మున్సిపల్ కార్యాలయం, జెడ్పీ కార్యాలయం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఈ మేరకు కరీంనగర్ టౌన్-2 ఏడీఈ ఎం. లావణ్య పేరుతో విద్యుత్ శాఖ ప్రకటన విడుదలైంది. విద్యుత్ శాఖ అధికారులకు వినియోగదారులు సహకరించాలని ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ మజీద్ హుస్సేన్ కోరారు.

# కమలాపూర్‌లో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ



**కమలాపూర్ సెప్టెంబర్ 10 (పిసి డబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అట్టహాసంగా శనివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.తెలంగాణ సంప్రదాయం కొట్టొచ్చినట్టు ప్రత్యేకంగా బతుకమ్మ పెద్ద ఎత్తున ప్రభుత్వం సహకారంతో గ్రామపంచాయతీలు ఘనంగా ఏర్పాట్లు చేశాయి.తొలి రోజు శనివారం మహిళలు ఆడపడుచులు ఉత్సాహంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది పసుపు కుంకుమలతో గౌరమ్మను చేశారు.బతుకమ్మ పాటలు భక్తి పాటలు పాడుతూ చప్పట్లు కోలాటం ఆడుతూ సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు. తొమ్మిది రోజులు పండగ జరుపుకొని చివరగా పెద్ద బతుకమ్మతో పండుగ ముగింపు దశకు చేరుతుంది.దీనితో కమలాపూర్ మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో పండుగ సందడి వాతావరణం నెలకొంది.

# కన్నూర్‌లో ఘనంగా ప్రారంభమైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

**- ఏర్పాట్లు చేసిన సర్పంచ్ పుల్లూరు శోభ శ్రీనివాసరావు పాలకవర్గం**





**కమలాపూర్ సెప్టెంబర్ 10(పిసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కన్నూర్ గ్రామంలో తొలిరోజు శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు వేణుగోపాలస్వామి గుడి వద్ద ఘనంగా జరిగాయి. ఈ బతుకమ్మ వేడుకలను కన్నూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పుల్లూరి శోభ శ్రీనివాస్ రావు,పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.అక్క చెల్లెలకు ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంతోషంగా ఆడుకునే విధంగా గ్రామపంచాయతీ పర్యవేక్షణలో గ్రౌండ్ అంతా లైటింగ్ ఏర్పాటు చేశారు.తంగేడుపూలు,గునుగు,తీరొక్క పూలతో గౌరమ్మను చేసి బతుకమ్మను పేర్చి గ్రామంలోని మహిళలు ఆడపడుచులు అంత ఒకచోట చేరి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయం,ఉట్టిపడేలా బతుకమ్మ పాటలు భక్తి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ చప్పట్లు కోలాటాలతో వేణుగోపాలస్వామి గుడి మారు మోగింది.ఈ బతుకమ్మ పండుగ ఎంగిలి పూలతో ప్రారంభమై తొమ్మిది రోజులు కొనసాగుతుంది.చివరి రోజు పెద్ద బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయి.దీనితో కన్నూర్ గ్రామం అంతా కొత్తగా సందడిగా కనిపిస్తూ పండుగ వాతావరణం నెలకొంది.

# ఎండీ గౌస్‌పల్లిలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**- సర్పంచ్ పసుల కార్తీక్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు**





**మల్లంపల్లి, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని ఎండీ గౌస్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పసుల కార్తీక్ ఆధ్వర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రకృతిపై ప్రేమను, మహిళల ఐక్యతను చాటిచెబుతుందని పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరాహార దీక్ష

**- ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి: వైద్యుల అంజన్ కుమార్**





**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటు చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ, టీపీసీసీ చేపడుతున్న పోరాటానికి మద్దతుగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా చౌక్‌లో నిరాహార దీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దానికి భంగం కలిగించే చర్యలను సహించబోమని అన్నారు. ఓట్ల అక్రమాలపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన సందర్భంలో జరిగిన లాఠీచార్జి, అరెస్టులను ఖండిస్తూ నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆకారపు భాస్కర్ రెడ్డి, అబ్దుల్ రెహమాన్, పర్వత మల్లేశం, వరాల నర్సింగం, కాంతాల జగన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పండుగ "బతుకమ్మ"

**- శ్రీవైష్ణవి నర్సింగ్ కళాశాల చైర్మన్ మంత్రిపల్లి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఇనపనూరి పుల్లన్న**

**- కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు**

**- ఎంగిలిపూల బతుకమ్మ పండుగలో పులకించిన విద్యార్థినిల మనసులు**

**- తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా సాగిన అద్భుత వేడుకల విశేషాలు**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పండుగ బతుకమ్మ అని శ్రీవైష్ణవి నర్సింగ్ కళాశాల చైర్మన్ మంత్రిపల్లి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఇనపనూరి పుల్లన్న అన్నారు. ఖమ్మం గడ్డపై తెలంగాణ సాంస్కృతిక శోభ పరిమళించింది. శనివారం శ్రీవైష్ణవి ఒకేషనల్ నర్సింగ్ కళాశాల ప్రాంగణం రంగురంగుల పూల వనాలుగా, ఆత్మీయతల హరివిల్లులా మారిపోయింది. తెలంగాణ ఆడపడుచుల నయనాల్లో ఆనందం తొట్టిసలాడగా, అపురూపమైన ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా, హృద్యంగా సాగాయి. రంగురంగుల సాంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబై, కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన విద్యార్థినిలు పండుగ శోభను రెట్టింపు చేశారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి ప్రకృతి ప్రసాదితమైన రకరకాల పూలను ఎంతో ప్రేమగా పేర్చి, తమ చేతులతో స్వయంగా తీర్చిదిద్దిన అందమైన బతుకమ్మలను కళాశాల ప్రాంగణంలో ప్రతిష్టించారు. ఆ పూల సిరుల చుట్టూ విద్యార్థినులు చేరి చప్పట్లు కొడుతూ, ఉత్సాహంగా పాడుతూ సాగిన 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..' పాటలు ఆ ప్రాంతం అంతటా మార్మోగాయి. వారి లయబద్ధమైన అడుగులు, గలగలా నవ్వులు చూసేవారికి కనులవిందుగా నిలిచాయి. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ ఇనపనూరి పుల్లన్న మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు మన మూలాలను మరవకూడదని మనసారా ఆశీర్వదించారు. కళాశాల చైర్మన్ మంత్రిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...

బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, అది ఐక్యతకు, స్నేహభావానికి ప్రతీక అని ఉద్బోధించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ పండుగ వేడుకల్లో అకాడమిక్ డైరెక్టర్ దొండేటి నరేశ్, అధ్యాపక బృందం సభ్యులు మనోజ్, నాగేంద్రమ్మ, జ్యోత్స్న, మధు, పుష్పరాజ్, ఉమా తదితరులు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థినులను ఉత్సాహపరిచారు. పూల పరిమళాలు, పాటల నాదాలు, అన్నాచెల్లెళ్ల అనుబంధాలు, స్నేహాల కలయికతో శ్రీవైష్ణవి నర్సింగ్ కళాశాల ప్రాంగణం అపూర్వమైన పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# చిలుకోయలపాడులో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు.. పూల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**



**సీరోల్, అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ. చిలుకోయలపాడు గ్రామంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తుల్లో చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో పేర్చిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఈ పూల పండుగలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. కుటుంబాల సుఖసంతోషాలు, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# పని చేసే వారికే పట్టం



**• ప్రలోభాలకు లొంగని ఆర్టిసి కార్మికులు • విజయం బాధ్యతను మరింత పెంచింది • ఎంప్లాయిస్ యూనియన్ అభినందన సభలో బాగం**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్టిసి కార్మికులు పని చేసే వారికే పట్టం కట్టారని తమ పక్షాన కష్ట కాలంలో ఎవరు నిలబడ్డారో ఎవరు హక్కుల కోసం పోరాడారో వారికే గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అధికార పార్టీకి తొత్తు సంఘాలు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన కార్మికులు లొంగలేదని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన ఆర్టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అభినందన సభ శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ... అనేక దశాబ్దాల ఆర్టిసి చరిత్రలో అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మొదలు ఇప్పటి వరకు అధికార పార్టీ ఏనాడు ఆర్టిసి గుర్తింపు ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదన్నారు. ఏకంగా రాష్ట్ర క్యాబినెట్ ఏర్పాటుచేసి కార్మికులను వంచించిన ఒక నాయకున్ని అడ్డుపెట్టుకుని సొంత సంఘాన్ని సైతం పక్కకు నెట్టి అడ్డదారిన ఓ తొత్తు సంఘానికి గుర్తింపునిచ్చేందుకు ప్రయత్నించిందన్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు, పిసిసి అధ్యక్షుడు సైతం ప్రచారంలో పాల్గొన్న కార్మికులు మాత్రం పనిచేసే సంఘానికి గుర్తింపు నిచ్చారన్నారు. 50 శాతానికి పైగా ఓట్లు తెచ్చుకుని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయ ఢంకా మోగించిందని ఈ విజయం యూనియన్ బాధ్యతను మరింత పెంచిందని హేమంతరావు తెలిపారు. ప్రతి రీజియన్కు కోట్ల రూపాయలను వెదజల్లారని ప్రలోభం తారాస్థాయికి చేరిన కార్మికులు నిష్పక్షపాతంగా ఓటు వేశారని ఆయన తెలిపారు. ప్రధానంగా ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను సజావుగా కార్మికులకు అన్యాయం జరగని రీతిలో విలీనం జరగాలని హేమంతరావు సూచించా రు. కార్మికులకు అండగా సిపిఐ, ఏఐటియుసి పనిచేస్తాయని ఆయన తెలిపారు. సభ అనంతరం సిపిఐ, ఏఐటియుసి నాయ కులు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్ రెడ్డి, పిల్లి రమేష్, సిపిఐ, ఏఐటి యుసి, ఎంప్లాయిస్ యూనియన్ కూటమి నాయకులు మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, అనిత, గాదె లక్ష్మి నారాయణ, ఎల్ఆర్కేరావు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



# మధురానగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**- ఒకే దుస్తులలో మహిళల కోలాటం, దాండియా నృత్యాలు**



**గంగాధర, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని విశ్వబ్రాహ్మణ వీధిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూల పండుగకు మహిళలు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. మహిళా సోదరీమణులు ఒకే రకమైన దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ సందడి చేశారు. దాండియా నృత్యాలతో వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు. ఆటపాటలు, నృత్యాలతో వీధిలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు కలిసికట్టుగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొని ఆనందోత్సాహాలను పంచుకున్నారు.

# గుర్తూరులో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు









### బతుకమ్మ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దిన సర్పంచ్ కవిత బాలకృష్ణ

### చిన్నారుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణ

**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను మహిళలు శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామంలోని ఏడుగురు అక్కాచెల్లెళ్ల బతుకమ్మ ప్రాంగణాన్ని సర్పంచ్ కవిత బాలకృష్ణ ఆధ్వర్యంలో సుందరంగా ముస్తాబు చేశారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. గ్రామపంచాయతీ తరఫున బాలకృష్ణ, ఉపసర్పంచ్ పంజాల మహేష్ గౌడ్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరాగా, వారి ఆటపాటలను తిలకించేందుకు పురుషులు సైతం వచ్చారు. ఈ వేడుకల్లో వరుసకు మామా, కోడలయ్యే ఇద్దరు చిన్నారులు తమ ఆటపాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఆకేరు జలపాతం సమీపంలోని మైసమ్మ ఆలయం పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. వేడుకలకు చక్కటి ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కవిత బాలకృష్ణకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, వర్షాలు లేక కాలువలు ఎండిపోవడంతో బతుకమ్మల నిమజ్జనానికి నీరు అందుబాటులో లేక మహిళలు కొంత నిరాశకు గురయ్యారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి: బీజేపీ రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్



**రామడుగు, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని, విద్యుత్ కోతలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్ విమర్శించారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.రామడుగు మండలంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో వెదిరా ఎక్స్ రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై రైతులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు పెట్టిన కన్నీరు పాలకులకు తగులుతాయి" అని వ్యాఖ్యానించారు. రైతులకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాకుండా ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.నిరసన సందర్భంగా బీజేపీ నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని బీజేపీ నాయకులు పట్టుబట్టారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్ పటేల్, బండ తిరుపతిరెడ్డి, దళిత మోర్చా మండల ఉపాధ్యక్షుడు కొలపురి రమేష్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మామిడిపెల్లి చైతన్య, మండల ప్రధాన కార్యదర్శులు పోచంపెల్లి నరేష్, గుంట అశోక్, మండల ఉపాధ్యక్షులు కాడే నర్సింగం, దురుశెట్టి రమేష్, సర్పంచ్ దయ్యాల వీరమల్లు, ఉపసర్పంచ్‌లు వేముండ్ల కుమార్, కుమ్మరి అనిల్, బీర్ల వినోద్, సందపలుకల మహేందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు దయ్యాల రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు జంగిలి కరుణాకర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిభకు రెక్కలు.. జాతీయ స్థాయికి బాటలు!

### ఈనెల 15న ఖమ్మంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

### చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యం: మందుల వెంకటేశ్వర్లు



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయికి ప్రోత్సహించేందుకు ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 14, 16 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు.20వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్2026కు జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల పోస్టర్లను జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు.జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 14 నుంచి 16 వరకు సదాశివపేటలో నిర్వహించే జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మం జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.14 ఏళ్లలోపు విభాగంలో ట్రయాథ్లాన్ ఏ, బీ, సీ, కిడ్స్ జావెలిన్ పోటీలు నిర్వహిస్తారు. 16 ఏళ్లలోపు విభాగంలో పెంటాథ్లాన్, 60 మీటర్లు, 600 మీటర్ల పరుగులు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, 80 మీటర్ల హర్డిల్స్ పోటీలు ఉంటాయి. అర్హులైన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మెమోతో ఈనెల 15న ఉదయం 8 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియానికి హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. పాల్గొనే వారికి భోజన సదుపాయం, ధ్రువపత్రాలు, విజేతలకు పతకాలు, ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.మరిన్ని వివరాలకు 9441747772, 9440718196, 9985771159, 7569211736 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. తెలంగాణ అథ్లెటిక్స్ ప్రధాన శిక్షకుడు మహమ్మద్ గౌస్, జిల్లా అసోసియేషన్ కోశాధికారి ఎం. సుధాకర్, పోటీల నిర్వహణ కార్యదర్శి సీహెచ్. కృష్ణయ్య, సీనియర్ క్రీడాకారులు ఏ. మైథిలి, ఏ. గౌతమ్, డి. వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశక్తి ఆలయంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

- మహిళలను గౌరవించండి.. కుటుంబ బంధాలను కాపాడుకోండి: కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.ఈ వేడుకలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. భవానీ అమ్మవారి దీక్షలో ఉన్న ఆయనతోపాటు సతీమణి బండి అపర్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తంగేడు, గునుగు వంటి పూలతో బతుకమ్మలను అలంకరించడం తెలంగాణ ప్రత్యేకతను చాటుతుందని అన్నారు.మహిళలను గౌరవించాలని, కుటుంబ బంధాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పండుగలు కుటుంబాల్లో ఆనందాన్ని పంచడంతోపాటు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రకృతిని ప్రేమించడం, చెరువులను సంరక్షించడం, మన సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాశక్తి ఆలయంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం దాండియా నృత్యాలు, భక్తిగీతాల కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.



# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ







- ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేసీఆర్ బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగగా గుర్తింపు కల్పించి తెలంగాణ సంస్కృతికి విశిష్టత తీసుకొచ్చారని పేర్కొన్నారు. వేడుకల్లో మహిళలు 200కు పైగా బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. 'ఐ లవ్ యూ కేసీఆర్' ఛాయాచిత్ర వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తాతా మధుసూదన్ మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపి బహుమతులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటు హక్కు హరించే చర్యలను సహించం!

**• కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి: మొహమ్మద్ తాజోద్దీన్**




**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తక్షణమే తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ తాజోద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని తాజోద్దీన్ పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన పౌరుల పేర్లు తొలగించబడితే, అది ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఖ్యకు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడించి, ఓటర్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ముఖ్యంగా ముస్లింలు, దళితులు, సిక్కులు, ఇతర మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన పౌరులు ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల సవరణలో పారదర్శకత పాటించాలని, పేర్లు తొలగించిన వారికి తమ అభ్యంతరాలు తెలియజేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, ఎన్నికల కమిషన్ పనితీరుపై వచ్చిన ఆరోపణలను పరిశీలించాలని తాజోద్దీన్ కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతోపాటు, తొలగించబడిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ఎన్నికల వ్యవస్థపై ఉందని మొహమ్మద్ తాజోద్దీన్ స్పష్టం చేశారు.

## బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై

# గంభీర్ అసంతృప్తి!

**• బంతికి, బ్యాట్‌కు మధ్య సమాన పోటీ ఉండాలి.. బౌలర్ల కెరీర్‌లు కూడా ముఖ్యమే**




**రాంచీ, అక్టోబర్ 10:** భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రాంచీలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా ఓటమి నేపథ్యంలో పిచ్ స్వభావంపై భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. బ్యాటర్లకు మాత్రమే అనుకూలంగా ఉండే పిచ్‌లతో క్రికెట్‌లో బంతికి, బ్యాట్‌కు మధ్య సమతుల్యత దెబ్బతింటోందని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో బౌలర్లు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమవుతోందని పేర్కొన్నాడు. రాంచీలో జరిగిన రెండో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. అయితే భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. వెస్టిండీస్ జట్టు 19 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాటర్లు భారీగా పరుగులు సాధించగా, బౌలర్లు పరుగులు నియంత్రించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడుతూ.. బ్యాట్‌కు, బంతికి మధ్య సమాన పోటీ ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారని తెలిపాడు. కేవలం ఫోర్లు, సిక్సర్లు మాత్రమే కనిపించేలా కాకుండా బౌలర్లకూ అవకాశాలు కల్పించే పిచ్‌లు ఉండాలని అభిప్రాయపడ్డాడు. జాతీయ జట్టులో స్థానం సంపాదించేందుకు బౌలర్లు ఎంతో కష్టపడతారని, వారి శ్రమకు తగిన గుర్తింపు లభించేలా ఆట పరిస్థితులు ఉండాలని పేర్కొన్నాడు. బౌలర్ల కెరీర్‌లు కూడా ముఖ్యమేనని, సమతుల్యమైన పోటీ ఉన్నప్పుడే మెరుగైన క్రికెట్‌ను చూడగలమని స్పష్టం చేశాడు. అయితే ఓటమికి పిచ్‌ను మాత్రమే కారణంగా చూపలేమని గంభీర్ పేర్కొన్నాడు. భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో తమ జట్టు విఫలమైందని అంగీకరించాడు. వెస్టిండీస్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారని ప్రశంసిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రత్యర్థిని ఎలా నిలువరించాలో తమ జట్టు నేర్చుకోవాల్సి ఉందని తెలిపాడు. జట్టు ప్రదర్శనను మెరుగుపరుచుకునేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నాడు.
బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు, మంచు ప్రభావం బౌలర్లకు సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో గంభీర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్రికెట్‌లో ఉత్కంఠ పెరగాలంటే బ్యాటర్లతో పాటు బౌలర్లకూ సమాన అవకాశాలు లభించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

# ఎలాన్ మస్క్‌పై వెంకటేశ్ ప్రసాద్ ఘాటు విమర్శలు!

**టెస్లా ప్రయోజనాల కోసం బీవైడీని అడ్డుకున్నారు.. భారత్ జాతీయ భద్రతపై నీతులు చెబుతున్నారు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** ప్రముఖ వ్యాపారవేత్త, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌పై భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల విషయంలో మస్క్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. తన వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా మస్క్ వ్యవహరిస్తున్నా రని విమర్శించారు. తన టెస్లా కార్ల అమ్మకాలు తగ్గుతాయనే భయంతో చైనాకు చెందిన బీవైడీ సంస్థ అమెరికా మార్కెట్‌లోకి రాకుండా అడ్డుకున్నారని వెంకటేశ్ ప్రసాద్ ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు భారత్ విషయానికి వచ్చేసరికి జాతీయ భద్రతా హక్కులను ప్రశ్నిస్తూ వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. మస్క్ గొప్ప వ్యాపారవేత్త అయినప్పటికీ, ఆయన వైఖరిలో స్వార్థం కనిపిస్తోందని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గతంలో మస్క్ విభేదించిన విషయాన్ని కూడా ప్రసాద్ ప్రస్తావించారు. ట్రంప్ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని ఆరోపించిన మస్క్.. తన వ్యాపార ప్రయోజనాలకు ఇబ్బందులు ఎదురవుతాయనే పరిస్థితుల్లో మౌనం వహించారని వ్యాఖ్యానించారు. వ్యాపార ప్రయోజనాల కోసం ఒక విధంగా, ఇతర దేశాల విషయంలో మరో విధంగా మాట్లాడటం సరికాదని తన పోస్టులో అభిప్రాయపడ్డారు. **స్టార్‌లింక్ అనుమతులపై వివాదం** మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించేందుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తోంది. ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోందంటూ మస్క్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీని ఉద్దేశిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కొన్ని ప్రాంతాలకు ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేదని, స్టార్‌లింక్ సేవల ద్వారా విద్యార్థులకు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. మస్క్ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల విషయంలో ఎలాంటి సంస్థపైనా వివక్ష చూపడం లేదని స్పష్టం చేసింది. సంబంధిత సంస్థలు జాతీయ భద్రతా నిబంధనలను పాటించాల్సి ఉంటుందని, నిబంధనల ప్రకారమే అనుమతుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. స్టార్‌లింక్‌తో పాటు ఇతర సంస్థల దరఖాస్తులనూ నిబంధనల మేరకు పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో వెంకటేశ్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వ్యాపార పోటీ, జాతీయ భద్రత, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

# సీజేపీ నిరసనలకు మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మద్దతు

**• శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు.. ఎక్స్ వేదికగా స్పందన**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనలకు భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మద్దతు తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని పేర్కొంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్య కార్యకలాపం. చివరిసారిగా నేను విన్నప్పుడు భారత్ ప్రజాస్వామ్య దేశంగానే ఉంది' అని మంజ్రేకర్ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ పోస్టు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తున్న సీజేపీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. అయితే, ప్రదర్శనకు అనుమతి నిరాకరించడంతో పాటు భద్రతా ఏర్పాట్లను పోలీసులు కట్టుదిట్టం చేశారు. నిరసనకు బయలుదేరిన సీజేపీ నేతలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై మంజ్రేకర్ స్పందిస్తూ శాంతియుత నిరసనల ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. రాజకీయ, సామాజిక అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో అవకాశం ఉండాలన్న సందేశాన్ని ఆయన పోస్టు ద్వారా వెల్లడించారు. సీజేపీ నిరసనలకు మద్దతుగా మాజీ క్రికెటర్ స్పందించడం రాజకీయ, క్రీడా వర్గాల్లో చర్చకు దారితీసింది.

# కీలక సమయంలో కుల్‌దీప్‌కు బంతి ఇవ్వడమే తప్పిదం!

**రాంచీ, అక్టోబర్ 10:** వెస్టిండీస్‌తో రెండో టీ20లో భారత్ ఓటమిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ స్పందించారు. కీలకమైన 17వ ఓవర్‌ను కుల్‌దీప్ యాదవ్‌కు ఇవ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. ఆ ఓవర్‌లో వెస్టిండీస్ 24 పరుగులు సాధించడంతో మ్యాచ్ భారత్ చేజారిందని అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో మయాంక్ యాదవ్ లేదా అర్ష్‌దీప్ సింగ్‌తో బౌలింగ్ చేయించి ఉంటే ఫలితం మరోలా ఉండేదని పేర్కొన్నారు. 250 పరుగుల లక్ష్యాన్ని కూడా కాపాడుకోలేకపోవడానికి బౌలింగ్ వ్యూహమే కారణమని విశ్లేషించారు.



# మళ్లీ టీమిండియాకు ఆడకపోయినా నాకేం నష్టం లేదు!

**జట్టులో చోటు దక్కకపోవడంపై మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు**

**దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా.. బెంగాల్ జట్టుకు నా ఫిట్‌నెస్ నిరూపించుకున్నా**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** భారత జట్టులో తిరిగి చోటు దక్కించుకోవడంపై టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి తిరిగి ఎంపిక కాగా, షమీకి మాత్రం అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో తన ఎంపికపై స్పందించిన షమీ.. ప్రస్తుతం తన దృష్టి మొత్తం దేశవాళీ క్రికెట్‌పైనే ఉందని స్పష్టం చేశాడు. భువనేశ్వర్ కుమార్‌కు భారత జట్టులో ఆడే అవకాశం లభించడం సంతోషకరమని షమీ పేర్కొన్నాడు. అయితే, అతడి ఎంపికతో తనకు సంబంధం లేదని తెలిపాడు. తనకు ఎక్కడ ఆడే అవకాశం వచ్చినా అత్యుత్తమ ప్రదర్శన చేయడమే లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ మ్యాచ్‌పైనే పూర్తిగా దృష్టి పెట్టినట్లు వెల్లడించాడు. గత రెండు, మూడేళ్లుగా తన విషయంలో ఇదే జరుగుతోందని షమీ వ్యాఖ్యానించాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నానని, బెంగాల్ జట్టు తరఫున తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నానని తెలిపాడు. అయినప్పటికీ తిరిగి భారత జట్టుకు ఆడే అవకాశం రాకపోతే అది తనకు నష్టం కాదని స్పష్టం చేశాడు. భువనేశ్వర్ కుమార్ పునరాగమనంతో సీనియర్ బౌలర్ల ఎంపికపై చర్చ మొదలైంది. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న షమీకి కూడా అవకాశం కల్పించాలని పలువురు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల మాజీ క్రికెటర్ వసీం జాఫర్ సైతం షమీ, మహమ్మద్ సిరాజ్‌లకు అవకాశాలు ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో బెంగాల్ తరఫున ఆడేందుకు షమీ సిద్ధమయ్యాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావడంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం తన ఆటపైనే దృష్టి సారిస్తానని అతడి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు మద్దతుగా మృణాల్



బాలీవుడ్ నటీనటులపై, ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై నటి మృణాల్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. తోటి నటీమణులు కత్రినా కైఫ్, కృతి సనన్‌లకు ఆమె బాసటగా నిలిచారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని ఇష్టానుసారం జీవించే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇటీవల తన 'పూజా మేరీ జాన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రసవానంతర శారీరక మార్పుల కారణంగా కత్రినా కైఫ్ బాడీ షేమింగ్‌కు గురికావడం, ఒక జువెలరీ యాడ్‌లో ధరించిన దుస్తుల కారణంగా కృతి సనన్ విమర్శలు ఎదుర్కోవడం వంటి సంఘటనల నేపథ్యంలో ఆమె స్పందించారు.

కత్రినా, కృతి ఇద్దరూ సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు."ప్రతి విషయంలోనూ తప్పులు వెతకడం మానుకోవాలి. సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే పిచ్చి పట్టినట్లుంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. వారి కృషిని, విజయాన్ని మరిచిపోయి చిన్న విషయాలపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ఒకప్పుడు మహిళలను మాత్రమే ఎక్కువగా విమర్శించేవారని, కానీ ఇప్పుడు పురుషులు కూడా ఇలాంటివి ఎదుర్కొంటున్నారని మృణాల్ పేర్కొన్నారు. కాగా, విమర్శల నేపథ్యంలో కృతి సనన్ నటించిన జువెలరీ ప్రకటనను సంబంధిత సంస్థ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

## రజినీకాంత్ 'జైలర్ 2' టిక్కెట్ రేట్ల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

**రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా అనుమతి**

సూపర్ స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' టికెట్ ధరలను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. దసరా పండుగ కానుకగా అక్టోబరు 15న ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో, తొలి వారం రోజుల పాటు పెంచిన ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంటూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై గరిష్ఠంగా రూ. 50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లలో రూ. 75 (జీఎస్టీతో కలిపి) అదనంగా వసూలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ పెరిగిన ధరలు సినిమా విడుదలైన అక్టోబరు 15 నుంచి అక్టోబరు 21 వరకు, అంటే వారం రోజుల పాటు వర్తిస్తాయి. దీనితో పాటు, తొలి వారం రోజుల్లో ప్రతిరోజూ ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు కూడా ప్రభుత్వం థియేటర్ యాజమాన్యాలకు అనుమతి ఇచ్చింది.



# 'రణబాలి' ట్రైలర్‌పై చిత్ర బృందాన్ని ప్రశంసించిన మంత్రి లోకేశ్

**థ్యాంక్స్ లోకేశ్ అన్నా..**

**సీమ గడ్డ గర్వపడే సినిమా ఇది: విజయ్ దేవరకొండ**



విజయ్ దేవరకొండ, రష్మిక మందానా జంటగా నటిస్తున్న 'రణబాలి' సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. దీనిపై హీరో విజయ్ దేవరకొండ భావోద్వేగంగా స్పందిస్తూ, ఈ సినిమా ద్వారా రాయలసీమ గడ్డకు తాను రుణం తీర్చుకుంటున్నానని తెలిపారు. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌ను వీక్షించిన మంత్రి లోకేశ్ చిత్ర బృందాన్ని అభినందించారు. రాయలసీమ చారిత్రక పోరాటాన్ని, బ్రిటిష్ పాలకుల అణచివేతను అద్భుతంగా ఆవిష్కరించారని ఆయన కొనియాడారు.లోకేశ్ ప్రశంసలపై విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "లోకేశ్ అన్నా.. రాయలసీమ నేల నాకు ఎంతో ఇచ్చింది. ఈ గడ్డకు నేను తిరిగి చెల్లించాల్సిన బాధ్యత, రుణం ఈ సినిమా రూపంలో నెరవేరుతోంది. మీ సందేశం మా చిత్ర యూనిట్‌లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. మన నేల గొప్పతనాన్ని, మన ప్రజల ఆత్మగౌరవాన్ని చూసి ప్రతి ఒక్కరి గుండె గర్వంతో ఉప్పొంగేలా ఈ చిత్రం ఉంటుంది. వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతి మీకోసం వేచి చూస్తోంది" అంటూ లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ కోతలు..

**800 మంది ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!**




ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తమ ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కంపెనీలోని మొత్తం సిబ్బందిలో సుమారు 5 శాతం మందిని, అంటే దాదాపు 800 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనికి సంబంధించిన ప్రకటన వచ్చే వారంలోనే ఉండవచ్చని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ పలు నివేదికలు పేర్కొంటున్నాయి.2025 చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఫుల్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 68 శాతం మంది అమెరికా, కెనడాలోనే పనిచేస్తున్నారు. తాజా తొలగింపులు కార్యరూపం దాల్చితే, 2022 తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత కానుంది. ఆ సమయంలో కూడా వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్లు తాత్కాలికంగా తగ్గడంతో వందలాది మందిని కంపెనీ తొలగించింది. ప్రస్తుతం వినిపిస్తున్న వదంతులపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది.అయితే, ఏయే విభాగాలపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఫీచర్ ఫిల్మ్‌లపై పనిచేస్తున్న క్రియేటివ్ టీమ్‌లలో కోతలు ఉండవచ్చని భావిస్తున్నారు. స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, మీడియా సంస్థల విలీనాలు, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు వీక్షకులను, ప్రకటనల ఆదాయాన్ని ఎక్కువగా ఆకర్షిస్తుండటం నెట్‌ఫ్లిక్స్‌కు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటోంది. కేవలం సబ్‌స్క్రిప్షన్‌లపై ఆధారపడకుండా, ప్రకటనలతో కూడిన ప్లాన్‌లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ వంటి కొత్త రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇటీవల ఒక సదస్సులో మాట్లాడిన కంపెనీ కో-సీఈఓ టెడ్ సారండోస్, తాము వృద్ధి చెందుతున్నప్పటికీ, నాయకత్వం ఆశించిన స్థాయిలో వేగంగా వృద్ధి సాధించలేకపోతున్నామని అంగీకరించారు.ఆర్థికంగా చూస్తే.. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన రెండో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ 12.56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 13 శాతం అధికం. అయినప్పటికీ, 2026 పూర్తి సంవత్సరానికి గాను ఆదాయ అంచనాలను తగ్గించడం, గత ఏడాదిగా కంపెనీ షేరు ధర గణనీయంగా క్షీణించడం వంటి పరిణామాలు పెట్టుబడిదారులలో ఆందోళన కలిగిస్తున్నాయి. అక్టోబర్ 20న కంపెనీ తదుపరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పునర్వ్యవస్థీకరణ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 'ధురంధర్' మరో ఘనత..

## గ్రామీ అవార్డుల బరిలో సౌండ్ ట్రాక్



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన 'ధురంధర్', 'ధురంధర్-2' సినిమాలు ఏ రేంజ్‌లో సక్సెస్ సాధించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదిత్య ధర్ తెరకెక్కించిన ఈ రెండు సినిమాలను ప్రేక్షకులకు విశేషంగా ఆదరించారు. ఒటిటిలోనూ ఈ సినిమాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే 'ధురంధర్-2: ది రివేంజ్' సినిమా మరో ఘనతను సాధించింది. ఈ సినిమా ఆల్బమ్ 2027 గ్రామీ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తం 8 విభాగాల్లో అవార్డుల పరిశీలనకు పంపినట్లు నిర్మాణ సంస్థ 'బి62 స్టూడియోస్' అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. విజువల్ మీడియాకు సంబంధించి సౌండ్‌ట్రాక్‌గా 'ధురంధర్' ఆల్బమ్‌ని పోటీకి పంపారు. అలాగే పలు పాటలను వేర్వేరు విభాగాల్లో గ్రామీ పరిశీలనకు పంపించారు.

# 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్



టాలీవుడ్‌లో కాజల్ అగర్వాల్ అడుగు పెట్టి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ హీరోయిన్‌గానే వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. పెళ్లయి బాబు పుట్టిన తర్వాత కూడా తన సినిమాల ఎంపిక విషయంలో తేడా చూపించకుండా కమర్షియల్ పాత్రలను చేయడం చూడవచ్చు. ప్రస్తుతం కాజల్ 'రామాయణ' సినిమాలో మండోదరి పాత్రలో కనిపించబోతోంది. కెరీర్ చివరి దశలో ఉందని భావిస్తున్న సమయంలో రణబీర్ కపూర్, సాయి పల్లవిలు రాముడు, సీత పాత్రలో నటిస్తున్న రామాయణ సినిమాలో కాజల్ అగర్వాల్ కి రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ కి భార్య పాత్రలో నటించే అవకాశం దక్కింది. కచ్చితంగా మండోదరి పాత్రతో కాజల్ మరో నాలుగు, అయిదు ఏళ్లు ఇండస్ట్రీలో కొనసాగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి 'రామాయణ 1' సినిమా రాబోతుంది. వచ్చే ఏడాదిలో 'రామాయణ 2' రానుంది.

# ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్.. మద్దతుగా కంగనా



టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని స్పష్టం చేశారు. కమల్ వ్యాఖ్యలకు నటి, ఎంపీ కంగనా రనౌత్ మద్దతు తెలిపారు.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, భారత ప్రధాని అంబానీనా? అంటూ సెటైరిక్ గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. "ఏ బిలియనీర్ అయినా, అది భారతీయ అయినా, అమెరికన్ అయినా... దేశ విధానాలను నిర్దేశించలేరు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ విమర్శించారు. "చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోంది. భారత్ కూడా అదే విధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోంది" అని వివరించారు.

"భారత్ ఒక ప్రజాస్వామ్య దేశం, వలస పాలిత ప్రాంతం (కాలనీ) కాదు. మేము ప్రపంచాన్ని స్వాగతిస్తాం. కానీ మా భవిష్యత్తును భారత ప్రజలమే నిర్ణయించుకుంటాం" అని కమల్ హాసన్ తన పోస్టులో తేల్చిచెప్పారు.

కమల్ పోస్టును రీషేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. "ఇది మస్క్‌కు బాగా తగిలి ఉంటుంది. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదు. కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారు" అంటూ ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసిన విషయం తెలిసిందే.